క్లుప్తంగా

నేడు కొత్తపల్లిలో గంగమ్మ జాతర



కొత్తపల్లిలో కొలువుతీరిన గంగమ్మ తల్లి

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లి గ్రామంలో ఆదివారం గంగమ్మ తల్లి జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి చల్ల సమర్పిస్తామని తెలిపారు. జాతరలో ప్రతి ఒక్కరూ పాల్గొని గంగమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు.

భాకరాపేటలో..

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని భాకరాపేట నడివీధి గంగమ్మ జాతర ఆదివారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారికి భోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవాలని కోరారు. ప్రజలు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి అమ్మవారి అనుగ్రహం పొందాలని తెలిపారు.

చిన్నారుల మృతి దురదృష్టకరం



చిన్నారి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

చిట్వేలి : ఎం.రాచపల్లిలో చిన్నారుల మృతి దురదృష్టకరమని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ఎం.రాచపల్లికి వెళ్లి మృతి చెందిన చిన్నారుల మృతదేహాలను, బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంఘటన తమను కలిచివేసిందని చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



ప్రజలకు నీళ్లు అందిస్తున్న దాసరి సంక్షేమ సంఘం నాయకులు

రాజంపేట రూరల్ : దాసరి సంక్షేమ సంఘం, దాసరి యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక శివాలయం వద్ద ఉచిత మంచి నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చలివేంద్రం ద్వారా పట్టణానికి పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు దాహార్తి తీర్చుతుందని తెలిపారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటరమణ, అధ్యక్షుడు ఓబులేసు, కార్యదర్శి గోవిందు గంగాధర తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు దూరం చేస్తున్న 'కూటమి'



మాట్లాడుతున్న అబ్దుల్లాఖాన్

సుండుపల్లె : ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల్ని కూటమి సర్కారు చెల్లించపోవడం విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాజంపేట నియోజకవర్గ అధ్యక్షుడు పి.అబ్దుల్లాఖాన్ అన్నారు. శనివారం సుండుపల్లెలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో రూ.3,900 కోట్లు చెల్లించాలన్నారు. బడ్జెట్‌లో రూ.2500 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కూటమి చర్యలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు బకాయిల్ని తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల కోసం విద్యార్థులను వేధించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన లారీ

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయరహదారిలో మన్నూరు వద్ద శనివారం ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కూలీలుగా గుర్తించారు. పసుపు మండి పనిచేసి చింతకొమ్మదిన్నెకు వెళుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మో.. హైవే..!

జాతీయ రహదారిపై ప్రయాణం అంటేనే వాహనాదారులు జంకుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. వరుస ప్రమాదాలు ప్రయాణికులు, వాహనచోదకుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. సర్వీసు రోడ్లు ప్రారంభం, ముగింపుల వద్ద భారీ బోర్డులు కనిపించేలా ఏర్పాటు చేయడం లేదు. చిన్నపాటి బోర్డులు ధ్వంసం కావడంతో వాహనదారులు గుర్తించడం లేదు. అందుకే హైవేపై సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

- జాతీయ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు

2024 జనవరి నుంచి 2025 ఏప్రిల్ వరకు జరిగిన ప్రమాదాలు

నెల	ప్రమాదాలు	గాయాలు	ప్రాణాలు కోల్పోయిన మృతుల సంఖ్య
జనవరి	2	-	2
ఫిబ్రవరి	3	3	1
మార్చి	2		1
ఏప్రిల్	3	4	4
మే	1	-	1
జూన్	6	-	6
జులై	1	1	-
ఆగస్టు	-	-	-
సెప్టెంబర్	2	7	2
అక్టోబర్	2	1	2
నవంబర్	3	26	1
డిసెంబర్	2	4	1
జనవరి	1	1	1
ఫిబ్రవరి	1	1	1
మార్చి	1	1	1
ఏప్రిల్	1	3	1



ఎస్.సోమవరం క్రాస్ వద్ద జరిగిన ప్రమాద దృశ్యం (ఫైల్)

సంబేపల్లె : హైవే.. ఓ మృత్యుదారిగా మారింది. ఇటీవల కాలంలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు భయాందోళనను కలిగిస్తున్నాయి. జాతీయ రహదారిలో ప్రయాణమంటే ఇంటికి చేరేదాకా క్షేమంగా చేరతామా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె మండల పరిధిలో దాదాపు 23 కిలోమీటర్ల మేరా 40 నంబర్ జాతీయ రహదారి విస్తరించింది. మండలంలోని కొండావాండ్లపల్లె క్రాస్ సమీపం నుంచి కలకడ దగ్గర మంగళపల్లె సమీపం వరకు జాతీయ రహదారి ఉంది. కొన్ని నెలలుగా జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువయ్యాయి. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం జరగడం.. అంబులెన్సుల సైరన్‌లతో ఆ ప్రాంతం మార్మోగడం దడ పుట్టిస్తోంది. మితిమీరిన వేగం కారణంగా జరిగే వాహన ప్రమాదాలతో మృత్యువు ఒడికి చేరుతున్నారు. జాతీయ రహదారుల భద్రత, ప్రమాదాల నివారణ కోసం నిర్దిష్టమైన ప్రణాళికలను అమలుచేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం కూడా ప్రయాణికులకు, వాహనదారులకు శాపంగా మారింది.

ప్రమాదానికి కారణాలు ఇవే..

మండల పరిధిలోని నారాణరెడ్డిపల్లె, మోటకట్ల, సంబేపల్లె, నల్లగంగమ్మ క్రాస్, దేవపట్ల గుట్టపల్లె, ఎస్.సోమవరం క్రాస్ జాతీయ రహదారి ఉంది. పలు చోట్ల సూచిక బోర్డులు దెబ్బతిన్నాయి. దీంతో బోర్డులను గమనించలేని ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

రహదారిపై ప్రయాణించే వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్లడం ప్రమాదాలకు కారణంగా కనిపిస్తోంది. సంబేపల్లె మండలంలోనే జనవరి నుంచే ఇప్పటి దాకా 30 ప్రమాదాలు చోటుచేసుకోగా ఎక్కువ శాతం ప్రాణాలు కోల్పోయారు. వాహనాదులు మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెంట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతున్నారు. జాతీయరహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు డివైడర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రమాదాలపై జాతీయ రహదారి అధికారులతో చర్చిస్తాం. జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న వాహనాలపై దృష్టి పెట్టి కంట్రోల్ కొరకు స్టాపర్లను ఏర్పాటు చేస్తాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద దాతల సహకారంతో సీసీ కెమరాలు ఏర్పాటు చేశాం. హైవే నిబంధలకు అనుగుణంగా ఏలా వెళ్లాలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు నివారించేందుకు అన్ని చర్యలు తీసుకొంటాం.

– భక్తవత్సలం, ఎస్‌ఐ, సంబేపల్లె మండలం

మంత్రికి వినతి



మంత్రి జనార్దన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శరత్‌కుమార్ తదితరులు

రాజంపేట : రాజంపేట కోర్టు క్లాంపెక్స్ సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి బార్ అసోసియేషన్ మాజీ చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు, రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతు నాయుడులు తీసుకెళ్లారు. శనివారం రాజంపేట ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంత్రితో భేటి అయ్యారు. కోర్టు క్లాంపెక్స్ అంశం విషయంలో త్వరగతిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కోర్టు క్లాంపెక్స్‌లో రెవిన్యూ శాఖ తహసీల్దారు కార్యాలయ భవనాలను న్యాయశాఖకు అప్పగించలేదని మంత్రికి తెలిపారు. కోర్టు క్లాంపెక్స్ ఒప్పందం అమలు చేసేందుకు ప్రభుత్వం తరపున చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధులు మంజూరు చేయండి

రాజంపేట ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాజంపేట ప్రెస్‌క్లబ్ సభ్యులు మంత్రి జనార్దన్‌రెడ్డికి విన్నవించారు. శనివారం రాజంపేటకు ఆయన వచ్చిన సందర్భంగా రాజంపేట ప్రెస్‌క్లబ్ కమిటి ప్రతినిధులు కలిశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు శివయ్యనాయుడు, ఓబులేసు, మందాశివయ్య, సునీల్, మండ్ల శ్రీహరి పాల్గొన్నారు.

'సాక్షి' ఎడిటర్‌పై తప్పుడు కేసు ఉపసంహరించుకోవాలి

రాయచోటి : సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయ రెడ్డితో పాటు ఆరుగురు జర్నలిస్టులపై నమోదు చేసిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌ను కలిసి సాక్షి జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని జర్నలిస్టులు వినతిపత్రం ఇచ్చారు. పల్నాడు జిల్లాలో ఈ నెల 3న జరిగిన హత్యకు సంబంధించి సాక్షి పత్రికలో వార్తలు రాయడం పట్ల ప్రభుత్వం, పోలీసులు కక్ష కట్టి కేసులు నమోదు చేయడం మంచి పద్ధతి కాదని వివరించారు. తక్షణం అక్రమ కేసులు ఎత్తివేయాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

'ఆపరేషన్ కగార్' రాజ్యాంగ, చట్ట విరుద్ధం

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం సహజ వనరులను బహుళజాతి సంస్థలకు దోచిపెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో నిర్వహిస్తున్న హత్యాకాండ రాజ్యాంగ, చట్ట విరుద్ధమని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. శనివారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద పలుసంఘాల నాయకులు దండకారణ్యంలో ఆదివాసీలపై సాయుధ బలగాల హత్యాకాండను నిరసిస్తూ ఈనెల 20వ తేదిన కడప నగరంలో నిర్వహిస్తున్న సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి గోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆదివాసీలపై హత్యాకాండను సాగిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 400 మంది అడవిబిడ్డలను ఎన్‌కౌంటర్ల పేరుతో హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై జరుపుతున్న అమానుష దాడులు, హత్యాకాండపై చర్చించేందుకు ఈ నెల 20న కడప నగరంలోని గాంధీనగర్ హైస్కూల్ సమీపంలోని ఇంజినీర్స్‌హాల్‌లో సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యావంతులు, యువత, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, నాయకులు రెడ్డెయ్య, మోటపోతుల రవిశంకర్, వంగిమళ్ల రమణ, ఎమ్మార్పీఎస్ రామాంజులు, బంజారాసంఘం నేత శంకర్ నాయక్, బీసీ సంఘం నాయకుడు రాఘవయ్య, కార్మిక నాయకుడు మహబూబ్‌బాషా, బాస్ నేత తాతయ్య, నాగార్జున పాల్గొన్నారు.



కరప్రతాలు ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్ : పెనగలూరు, చిట్వేలి మండలాల పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. టీజీపల్లి సబ్‌స్టేషన్‌తో పాటు టీజీ పల్లి ఫీడర్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం

ఓబులవారిపల్లె : వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని, ముస్లింలను బెదిరించేలా ఉందని మండల సీపీఐ కార్యదర్శి చింతలపూడి నాగమ్మ అన్నారు. శనివారం కొర్లకుంటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రద్దు కోసం ముస్లింలంతా ఐకమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రవీణ్, శివ నారాయణ, సుబ్బమ్మ, ఈశ్వరమ్మ, నాగేంద్ర, చంద్ర, వంశీ, జయన్న, యానాది, మనోజ్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

• కల్యాణం.. కమనీయం

రాజంపేట టౌన్ : పట్టణంలో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం సువర్చన సమేత హనుమంత్ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు హరినాథశర్మ స్వామివారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా హరినాథశర్మ హనుమంతుడి వివాహంపై భక్తులకు ఉన్న అనుమానాన్ని నివృత్తి చేశారు. హనుమంతుడికి భవిష్యత్తు బ్రహ్మ అయ్యే గొప్పవరం ఉందని, బ్రహ్మ పదవిని స్వీకరించాలంటే బృహత్తు అయ్యి ఉండాలని తెలిపారు.



హనుమంతుడి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

• సీతారాముల కల్యాణం

రాజంపేట టౌన్ : మండలంలోని కూచివారి పల్లె గ్రామంలోని రామాలయంలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి ఆలయ అర్చకులు గోపాల్ స్వామివారి కల్యాణ క్రతువును కమనీయంగా జరిపించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

• అచ్చనపల్లి గ్రామంలో..

రాజంపేట రూరల్ : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని అచ్చనపల్లి గ్రామంలో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి సీతారాముల కల్యాణంను తిలకించారు. ఆకేపాటితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని భువనగిరిపల్లిలో శనివారం శ్రీమహవిష్ణువు అవతారంలో శ్రీరామచంద్రమూర్తిని ప్రత్యేకంగా కొలువు దీర్చి అలంకరించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ ఇంటర్‌లో 208 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 188 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 278 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 191 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతంలో సీనియర్ ఇంటర్‌లో 90.38 శాతం, ప్రథమ సంవత్సరంలో 68.71 శాతం ఉంది. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విద్యార్థి కె.రవితేజ 942 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. హెచ్ఈసీలో టి.సంధ్య 941 మార్కులు, సీఈసీలో డి.గాయత్రి 911 మార్కులు, బైపీసీలో హర్షకిరణ్మయి 840 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపుకు చెందిన నాగజ్యోష్న 470 మార్కులకు 463 మార్కులు, ఈ.మోనిష్ 462 మార్కులు, బైపీసీకి చెందిన ఎస్.జనీలా 440 మార్కులకు 414 మార్కులు, సీఈసీకి చెందిన వైష్ణవి 500 మార్కులకు 472 మార్కులు, హెచ్ఈసీకి చెందిన నందిని 500 మార్కులకు 421 మార్కులు సాధించారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ద్వితీయ సంవత్సరం ఏఅండ్‌టీ గ్రూపుకు చెందిన వీ.కవిత 972 మార్కులు, సీఎస్ఈకి చెందిన పి.స్వప్న 970 మార్కులు, ఈటీ గ్రూపుకు చెందిన కె.వర్షితసాయి 921 మార్కులు, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపుకు చెందిన సి.పల్లవి 981 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల ప్రిన్సిపాల్ ఎస్వీ. రమణరాజు హర్షం వ్యక్తం చేశారు.



కె.రవితేజ

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

సుండుపల్లె : ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలలో కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు మండల స్థాయిలో మొదటి స్థానంలో ప్రతిభను కనపరిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివస్మృతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సి.వైష్ణవి, బి.కేతన అనే ఇద్దరు విద్యార్థినులు బైపీసీ గ్రూపులో 948/1000 మార్కులు సాధించి కార్పొరేట్ విద్యాసంస్థల కంటే అధికంగా మండల స్థాయిలో మొదటి స్థానంలో తమ విద్యార్థినులు ప్రతిభ కనపరచడం సంతోషదాయకమని తెలిపారు.



సి.వైష్ణవి

రామాపురం : ఇంటర్ ఫలితాల్లో మండల స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 50 శాతం, ద్వితీయ సంవత్సరంలో 74 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎస్.సోఫియా 962 మార్కులు, సి.గంగోత్రి 959 మార్కులు సాధించింది. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో సి.లక్ష్మీశైలజ 439 మార్కులు, ఎస్.స్వాతి 419 మార్కులు సాధించింది. బైపీసీలో సి.గ్రీష్మసాయి, ఎస్.సమీవున్నిసా 419 మార్కులు ద్వితీయ స్థానంలో నిలిచింది.



ఎస్.సోఫియా

కస్తూర్బా బాలికల పాఠశాలలో..

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 89శాతం, రెండవ సంవత్సరం 62శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలం టాప్‌గా మండల కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులు సీఎస్‌సీలో బి.భవిత 484 మార్కులు, సుష్మ 477 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సీఎస్‌సీలో ఎం.తేజ 948, బి.భారతి 942 మార్కులు సాధించారు.

విద్యార్థుల ప్రభంజనం

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీ ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రభంజనం సృష్టించినట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణ తెలిపారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఎస్.ఆల్ఫియా 983/1000, ఎం.ఉదయశ్రీ 979/1000, ఎస్.దైబా 976/1000, శివనాగమణి 965/1000, ఉమ్మేఅయేమన్ 957/1000, షేక్ మెహ్రీనామూంజా 914/1000, ఎంపీసీలో షేక్.సోనియా 908/1000, హెచ్ఈసీలో ఎస్.సమీరా 910/1000 మార్కులను సాధించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో బి.నాగప్రసన్న 430/470, ఎస్.శివరంజని 428/470, బైపీసీలో కె.మహిమ 402/440, ఎస్.ఆఫ్రా 394/440, సీఈసీలో ఎస్.నస్రీన్ 404/500, బి.రాజేశ్వరి, ఎస్.హజ్నాలు 393/500, హెచ్ఈసీలో డిపి అమీన్ 398/5000, డివి ఫర్హీన్ 392/500 మార్కులను సాధించినట్లు తెలిపారు.



ఎస్.ఆల్ఫియా

చిన్నమండెం : ఇంటర్మీడియట్ ఫలితాలలో చిన్నమండెం మండలంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థులు మెరిశారు. మోడల్ స్కూల్‌లో 123 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 120 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 98 శాతంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఎంపీసీలో 964/1000 మార్కులను గీతాంజలి సాధించగా భవ్య 959/1000, గుణలక్ష్మీ 957/1000, బైపీసీలో 951/1000 మార్కులను హమీద్‌ఖాన్ పొందగా రెడ్డిపూజిత సీఈసీ గ్రూపులో 756/1000 మార్కులు సాధించారు. అదే విధంగా కేజీబీవీలో నాగలీలా 907/1000, నాగామృత 905/1000, రెడ్డిసుధ 803/1000 మార్కులు సాధించారు.



గీతాంజలి

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్‌మీడియట్ కళాశాలలో సెకండ్ ఇయర్‌లో 12 మంది విద్యార్థులకు గాను 8 మంది ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థిని ఎస్. జాస్మిన్ 814 మార్కులు, ఆయెషా 752 మార్కులు సాధించారన్నారు.

గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ

నందలూరు : మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల కళాశాల, నందలూరు విద్యార్థులు శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభను చాటారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 134 మందికి గాను 131 మంది పాస్ అయి 97.9 శాతం ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరంలో 144 మందికి గాను 135 మంది పాసై 93.54 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో కె జయలక్ష్మీ 1000 మార్కులకు 979, బైపీసీలో ఎ. త్రిలోచన 1000 మార్కులకు గాను 979, సీఈసీలో కె. పావనీ 1000 మార్కులకు గాను 952 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. అలాగే ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ఎ. చంద్రకళ 470 మార్కులకు గాను 459 మార్కులు, బైపీసీలో ఎస్. పూజిత శ్రీ 440 మార్కులకు 423 మార్కులు, సీఈసీ నందు ఎ లక్ష్మీదేవి 500 మార్కులకు 481 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు.



కె. జయలక్ష్మి

విద్యార్థిని ప్రతిభ

రాజంపేట : పట్టణంలోని సాతుపల్లి దళితవాడకు చెందిన జిల్లా ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దండు రాజా కుమార్తె దండు రిషిత ప్రతిభ చాటింది. శనివారం విడుదల అయిన ఇంటర్ ఫలితాల్లో రిషిత 941 మార్కులను సాధించింది.

వీరబల్లి: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినట్లు కలాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా తెలిపారు. మొదటి సంవత్సరంలో 93.45 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగింది. అలాగే ద్వితీయ సంవత్సరంలో 97.24 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆదర్శపాఠశాలలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు శనివారం విడుదలైన ఫలితాలలో మంచి ఉత్తీర్ణ సాధించినట్లు ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. మొదటి సంవత్సరం చదువున్న విద్యార్థులు 66 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణ సాధించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన సంధ్య

నందలూరు : నందలూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీకాంత్ రెడ్డి, రోజా దంపతుల కుమార్తె అయిన సంధ్య ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1,000 మార్కులకు 975 మార్కులు సాధించింది. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో 548 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. రాష్ట్రస్థాయి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన సంధ్యను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు మండలంలోని పలువురు అభినందించారు. ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని, తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తానని సంధ్య ప్రకటించింది.



సంధ్య

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ, అరవపల్లి గ్రౌండ్ వద్ద వెలసిన సీతారాముల దేవస్థానంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, ఎంపీపీ మేడా విజయబాస్కర్ రెడ్డికి శనివారం ఆహ్వాన పత్రిక ఇచ్చి కల్యాణానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం

లక్కిరెడ్డిపల్లి : రాష్ట్ర ఎన్జీఓ ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్‌యాదవ్ ప్రదోన్నతిపై ముద్దనూరుకు బదిలీ అయ్యారు. శనివారం లక్కిరెడ్డిపల్లి మానవతా మండల చైర్మన్ ఏఎస్ బాలసుబ్రహ్మణ్యం, కో చైర్మన్ శివశంకర్ రెడ్డి, కన్వీనర్ శివయ్య, సభ్యుడు కృష్ణ చైతన్యరెడ్డి, ప్రసాద్ యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవతా మండల సభ్యులు రవి శంకర్, రామాంజులు, లక్కిరెడ్డిపల్లి తాలుకా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు బలరామరాజు, చరణ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్ : దారుల్ ఉలూమ్ ఇందాదియాలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మదరసా ప్రిన్సిపల్ ముఫ్తీ సయ్యద్ మాసూమ్ సాఖిబ్ కోరారు. శనివారం పట్టణంలోని దారుల్ ఉలూమ్ ఇందావియా (మదరసా)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదరసాలో నూరానిఖైదా, నాజిరా ఖురాన్, హిఫ్జ్, పార్సీ, దరిసెనిజామి, మౌల్వీ కోర్సులలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.